



కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 332

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 24 మే 2026

# ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ

- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం
- ప్రజారోగ్యానికి సంజీవని ప్రాజెక్టు
- ఆరోగ్యంగా ఉన్న ప్రజలే సమాజానికి నిజమైన సంపద
- గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం- నెవర్ అగైన్
- నోరు తెరిస్తే అబద్ధం-మీడియా ముందు మంచోడిగా డ్రామాలు
- పూతలపట్టులో సంజీవని కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు






**పూతలపట్టు/చిత్తూరు జిల్లా,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దీనికోసం రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా సంజీవని కార్యక్రమం అమలు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి సంజీవని ప్రాజెక్టు ఏపీ వ్యాప్తంగా అమలు అవుతుందని ప్రకటించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం యాదమరిలో నిర్వహించిన సంజీవని కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. సంజీవని కేవలం ఒక సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదని, ఇది ఓ సమగ్ర డిజిటల్ పబ్లిక్ హెల్త్ ఆపరేటివ్ సిస్టమ్ అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ అడుగులు వేస్తోందని సీఎం స్పష్టం చేశారు. సంజీవని ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సిటిజెన్ వెల్ నెస్ మిషన్ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరెటివ్ అనే మూడు సూత్రాల ఆధారంగా ఈ వ్యవస్థ పని చేస్తుందని సీఎం అన్నారు. ముందస్తుగా గుర్తించటం, వ్యాధి రాకముందే నివారణ, చికిత్సల ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. వ్యక్తిగత డిజిటల్ హెల్త్ రికార్డులను వైద్యులు నిరంతరం పర్యవేక్షించేలా ఈ వ్యవస్థ సేవలందిస్తుందని వెల్లడించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన సంజీవని కార్యక్రమం... ఈ ఏడాది మార్చి నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమల్లో ఉందని.... ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి ప్రకటించారు. 42 వైద్య పరీక్షలను ఇంటి వద్దే నిర్వహించి రిపోర్టులు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజారోగ్యానికి అవసరమైన ప్రతీ అంశాన్ని సంజీవని ప్రాజెక్టు ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. డాక్టర్ అప్పాయింట్మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డుల పర్యవేక్షిస్తామని వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా వైద్య సేవలు పొందేలా చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**వైద్యరంగానికి ఎక్కువ నిధులు..** వైద్య ఖర్చులు భరించలేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయని, ఆ ఇబ్బందులను తప్పించడానికే ప్రజా ప్రభుత్వం సంజీవనిలాంటి వినూత్న ప్రాజెక్టు తీసుకువచ్చిందని అన్నారు. రాష్ట్రంలో విద్య-వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అధిక ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం ఉద్యమం చేపట్టామని అన్నారు. ఈసారి బడ్జెట్ లో వైద్యారోగ్య రంగానికి రూ.19,305 కోట్లు కేటాయించినట్టు వివరించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య

- 3లో

# పర్యాటకుల భద్రతే లక్ష్యం.. 'టూరిస్ట్ పోలీస్' వ్యవస్థపై పవన్ కల్యాణ్ కీలక ప్రకటన

- ఏపీలో 'పర్యాటక పోలీసు' వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదన
- పర్యాటకులకు పూర్తి భద్రత కల్పించడమే లక్ష్యమన్న పవన్ కల్యాణ్
- మంత్రివర్గ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడి
- గత ప్రభుత్వ హయాంలోనూ 20 చోట్ల టూరిస్ట్ పోలీస్ అవుట్‌పోస్టులు ప్రారంభం



**అమరావతి,కలంకౌంటర్ :** 'అటవీశాఖ, పర్యాటకశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు కలసి ఓ కమిటీగా ఏర్పడి రాష్ట్రంలో అద్భుతమైన సందర్శనీయ ప్రాంతాలు ఏమ-ున్నాయో గుర్తించాలి. సుమారు 200 ప్రాంతాలను గుర్తిస్తూ, అక్కడున్న సౌకర్యాలు, సదుపాయాలు గురించి పూర్తి వివరాలు సేకరించండి. దీనిపై అయిదు రోజుల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వండి. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల సందర్శన కోసం వచ్చే పర్యాటకుల భద్రత అనేది చాలా ముఖ్యం. ఇతర దేశాలు, రాష్ట్రాలు, జిల్లాలను దాటి కొత్త ప్రదేశాలను చూసేందుకు రాష్ట్రంలోకి వచ్చే వారికి పూర్తి భద్రత కల్పించేందుకు 'పర్యాటక పోలీసు' అనే కొత్త విధానంపై క్యాబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకుందాం' అని పవన్ కల్యాణ్ చెప్పారు. అటవీశాఖతో పర్యాటక శాఖ సమన్వయం చేసుకుంటే ఎకో టూరిజం అభివృద్ధికి రాష్ట్రంలో మంచి అవకాశాలున్నాయన్నారు. అద్భుతమైన అనుభూతి పర్యాటకులకు సొంతం అయితే, వారు పదిమందికి

# రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమానికి శ్రీకారం

- ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో "ఆపరేషన్ క్లీన్ స్వీప్
- మున్సిపాలిటీల్లో పూర్తి స్థాయిలో పరిశుభ్రంగా మార్చడమే కార్యక్రమం లక్ష్యం
- 4 వారాలపాటు నిర్వహించే కార్యక్రమాన్ని బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు
- పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లు ఊడ్చిన మంత్రి
- డివైడర్లకు పెయింటింగ్ వేసి, మొక్కలు నాటిన మంత్రి
- అన్న క్యాంటీన్‌లో ప్రజలతో కలిసి అల్పాహారం చేసిన మంత్రి నారాయణ





**విజయవాడ, కలంకౌంటర్ :** రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, డంప్‌యార్డ్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ వ్యవహారాల శాఖ నాలుగు వారాల ప్రత్యేక స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని సాంబమూర్తి రోడ్డులో గల కూర్మయ్య బ్రిడ్జి వద్ద నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రారంభ కార్యక్రమాన్ని మంత్రి పి. నారాయణ, స్థానిక శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కే. పట్టాభిరామ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ నగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మీశ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ బి. అనిల్ కుమార్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, ఆపరేషన్ క్లీన్ స్వీప్ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ జి.సమరం లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ... ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి వారంలో రోడ్లు, పబ్లిక్ ప్రదేశాల శుభ్రత చేపడతారన్నారు. రెండో వారంలో ప్రజల భాగస్వామ్యంతో కాలువల క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూడో వారంలో ఇళ్ళు, కమర్షియల్ సంస్థల వద్ద చెత్త వర్గీకరణ (సెగ్రిగేషన్)పై అవగాహన కల్పిస్తారు. నాలుగో వారంలో పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వంతో పాటు

- 2లో

# జగన్ను చూసి పిల్లలు కూడా నవ్వుకుంటున్నారు

- వందల మందిని చంపిన చరిత్ర జగన్ రెడ్డి కుటుంబానిది
- తల్లిని, చెల్లిని కూడా తరిమేశాడు
- జగన్ రెడ్డికేమో ప్యాలెస్ లు కావాలి... రాష్టానికి మాత్రం రాజధాని వద్దు
- మంత్రి అనగాని సత్యప్రసాద్ ఫైర్



**మంగళగిరి,కలంకౌంటర్ :** జగన్ రెడ్డి మీడియా ముందుకు వచ్చి తాను, తన కుటుంబం అమాయకులమని, సాధు జీవులమని చెప్పుకోవడం చూస్తుంటూ ప్రతి ఒక్కరు ఎద్దేవా చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఒక పక్క అమరావతిని వ్యతిరేకిస్తూ మరోవైపు మావిగన్ అంటూ పిచ్చి కూతలు కూస్తుంటే పిల్లలు కూడా నవ్వుకుంటున్నారని అన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో తనను కలిసిన మీడియా మిత్రులతో ఆయన మాట్లాడుతూ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు కొత్తగా నేను చాలా అమాకుణ్ణి, అహింసా వాదిని అని మాట్లాడుతున్నారని, వాళ్ళ పూర్వీకుల చరిత్ర, వాళ్ళ చరిత్ర ఏంటి అనేది ప్రపంచంలో అందరికి తెలుసనని అన్నారు. ఎన్ని దారుణాలు చేశారో.. ఎన్ని హత్యలు చేశారో రాయలసీమలో ఏ గడపని అడిగినా చెప్తారన్నారు. రాజారెడ్డి రాజ్యాంగం గురించి ఎవరిని అడిగినా కతలు కథలుగా చెప్తారని, అటువంటి రాజారెడ్డి పోలికలు నాకొచ్చాయి అని గర్వాంగా చెప్పుకున్న వ్యక్తి గొడ్డలి పార్టీ అధ్యక్షుడని అన్నారు. ఎస్ సి, ఎస్ టిలపై అరాచకాలు చేసి, హత్యలు చేసి.. వాళ్ళ చేత దొంగతనాలు చూపించిన చరిత్ర వాళ్లదన్నారు. ఇ సైకో గొడ్డలిపార్టీ అధ్యక్షుడు చేసిన అరాచకాలు మనం కళ్లారా చూసామని, తండ్రి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుగా పెట్టుకుని ఇతని వ్యాపారానికి అడ్డుగా ఉన్న ప్రతి ఒక్కరినీ హతమార్చిన వ్యక్తి అని, పరిటాల రవిగారితో సహా ఎంతోమందిని హత్య చేసిన వ్యక్తి అని అన్నారు. 5సంవత్సరాల పాలనా కాలంలో చంద్రయ్య లాంటి టీడీపీకి విధేయంగా ఉన్నటువంటి వారిని పార్టీ మారమని గొంతు మీద కత్తిపెట్టి కోసి చంపిన సంఘటనలు చూసామన్నారు. అమరనాథ్ గౌడ్, సుధాకర్ లను చంపేశారని, డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తలను పక్కన పెట్టుకున్న మనిషని అన్నారు. తల్లిని తరిమేశాడని, చెల్లిని ఆస్తి కోసం తరిమేశాడని, అతని వ్యక్తిత్వం అలాంటిదన్నారు. వాళ్ళ బాబాయ్ హత్య కేసుపై సీబీఐ వచ్చి ఎంక్వైరీ చేస్తుంటే వాళ్ళ ఎంపి అయిన బంధువుని కాపాడటం కోసం వాళ్ళ మీద దాడులు చేసి తరిమేశారని గుర్తు చేశారు.




## ఆపరేషన్ క్లీన్ స్వీప్' లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్



**వినుకొండ,కలంకౌంటర్ :** పట్టణంలోని లాయర్ స్ట్రీట్‌లో నిర్వహించిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ముందుగా ఆయన చీఫ్ విప్ వారి కార్యాలయం నుండి ఎలక్ట్రానిక్ స్కూటీపై స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ కార్యక్రమ ప్రాంతానికి చేరుకున్నారు. జీవీ రోడ్లపై చీపురు పట్టి వీధులను శుభ్రం చేయడంతో పాటు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు , నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఆహార భద్రత కమిటీ సభ్యునిగా కర్లపాటి నియామకం



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** జాతీయ ఆహార భద్రత చట్టం--2013 అనుబంధంగా ఏర్పాటైన ఎన్టీఆర్ జిల్లా ఆహార భద్రత కమిటీ సభ్యునిగా స్థానిక ప్రముఖ సామాజిక కార్యకర్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం జగ్గయ్యపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన కూటమి ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గత 28 సంవత్సరాలుగా సామాజిక కార్యకర్తగా గ్రామీణ ప్రజలు, మహిళలు, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ బాధ్యతను అప్పగించిందని ఆయన పేర్కొన్నారు. ఆహార భద్రత చట్టం సక్రమ అమలుకు కృషి చేయనునట్లు తెలిపారు.ప్రజా హక్కుల పరిరక్షణ, పారదర్శకత, బాధ్యతాయుత సేవల కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (రేషన్)లో పారదర్శకత కల్పించడంతో పాటు.. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందేలా చూడటం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరిగేలా నిరంతరం ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ చట్టం అమలులో ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రేషన్ డిపోలలో బియ్యం, సరుకులు సకాలంలో అందకపోవడం, సరుకుల పంపిణీలో తక్కువ తూకం వేయడం, పంపిణీ వ్యవస్థలో అవినీతి లేదా నిర్లక్ష్యం.అంగన్‌వాడీ కేంద్రాలలో ఆహార పంపిణీ లోపాలు. పాఠశాలల మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపించడం లేదా సరఫరా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకువస్తే జిల్లా యంత్రాంగం ద్వారా సమస్యలను పరిష్కరించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

## పర్యాటకుల భద్రతే లక్ష్యం.. 'టూరిస్ట్ పోలీస్' వ్యవస్థపై పవన్ కల్యాణ్ కీలక ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

చెబుతారు. ఫలితంగా రాష్ట్రం పర్యాటకానికి స్వర్గంగా మారుతుందని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో అటవీశాఖ, పర్యాటక శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో పవన్ కల్యాణ్ ఎకో టూరిజం అభివృద్ధి అవకాశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "పర్యాటక ప్రాంతాలతోపాటు దేవాలయాలను దర్శించే నిమిత్తం వచ్చే భక్తులకు భద్రతను కల్పించేలా పని చేయాలన్నదే నా ఆకాంక్ష. దీనివల్ల రాష్ట్రంలో 50 వేల మంది యువతకు ఉపాధి లభించడంతో పాటు, పూర్తి భద్రమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. దేవాదాయ శాఖను సమన్వయం చేసుకొని పర్యాటకం, ఆధ్యాత్మిక యాత్రలకు వచ్చే వారికి తగిన భద్రతనిచ్చేలా కార్యాచరణ రూపొందిద్దాం. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకొని పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలి.

**గ్రామాలకు పర్యాటక శోభ తీసుకురావాలి..** రాష్ట్రంలో విశిష్టతలు, ప్రత్యేకతలున్న గ్రామాలు చాలా ఉన్నాయి. అయితే వాటిని చూసేందుకు పర్యాటకులు వెళితే అక్కడ సదుపాయాలు లేకపోవడం నిరాసక్తత కలిగిస్తోంది. దీంతో చాలామంది ఆసక్తి చూపించడం లేదు. పంచాయతీరాజ్ అధికారులు దీనిపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించండి. ఈశాన్య రాష్ట్రాలకు పర్యటనకు వెళితే వారు ఇళ్లలోనే తగిన సదుపాయాలు కల్పిస్తారు. అతిథిని దేవుడిలా చూసుకుంటారు. అలాంటి విధానం రాష్ట్రంలోని గ్రామాల్లో తీసుకురావాలి. పైలెట్ ప్రాజెక్టులుగా కొన్ని ప్రాంతాలను ఎంచుకొని పర్యాటకం అభివృద్ధి చేయండి. ఇది అమలు అయింతే గ్రామాల ముఖచిత్రం మారుతుంది. ఆర్థికంగానూ బలోపేతం అవుతాయి. ఎకో టూరిజాన్ని మరింత అభివృద్ధి చేసి, పర్యాటకుల సంఖ్యను పెంచాలి. కర్నూలు జిల్లా కృష్ణ జింకలకు అత్యంత ప్రసిద్ధి. అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటకులు వీక్షించేలా అభివృద్ధి చేయాలి. నల్లమలలో ఉన్న బైర్లూటి, నెల్లూరు జిల్లాలో ఫ్లెమింగో పక్షుల విడిది కేంద్రాలు... ఇలా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేకతలు గుర్తించి, దానికి అనుగుణంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలి. ఎకో టూరిజాన్ని మరింత అభివృద్ధి చేసి, పర్యాటకుల సంఖ్యను పెంచాలి. కర్నూలు జిల్లా కృష్ణ జింకలకు అత్యంత ప్రసిద్ధి. అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటకులు వీక్షించేలా అభివృద్ధి చేయాలి. నల్లమలలో ఉన్న బైర్లూటి, నెల్లూరు జిల్లాలో ఫ్లెమింగో పక్షుల విడిది కేంద్రాలు... ఇలా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేకతలు గుర్తించి, దానికి అనుగుణంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలి.

**క్షేత్ర స్థాయికి వెళ్లండి..** అటవీ, పర్యాటక, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయండి. ఎకో టూరిజంలో చూడాల్సిన ప్రదేశాలు, దానికి తగిన రూట్ మ్యాప్ తో పాటు అక్కడున్న వసతులు, సౌకర్యాలపై ప్రత్యేకమైన యాప్ రూపొందించండి. గుర్తించిన 200 దర్శనీయ ప్రాంతాలను టూరిజం సర్క్యూట్ గా తీసుకొచ్చి, పర్యాటక సంస్థలు ఇచ్చే టూరిజం ప్యాకేజీలు గుర్తించేలా తయారు చేయాలి. ప్రకృతికి, వన్య ప్రాణులకు ఇబ్బంది కలగకుండా ఎకో టూరిజం ప్రాంతాలను తయారు చేయాలి. సందర్శనీయ ప్రాంతాల్లో ఉన్న వసతులు, అవకాశాలు ముందుగా గుర్తించాలి. అక్కడ పరిస్థితులను సమీక్షించుకొని, అవసరం అయిన సౌకర్యాలను కల్పించాలి. దీనిపై అన్నీ పరిశీలించిన తర్వాత అటవీ, పర్యాటక శాఖలు ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై జూన్ 10వ తేదీలోపు వీటిపై ఎంఓయూ చేసుకోవాలి. రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాలను గుర్తించి, దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి గారితో మాట్లాడి, పర్యాటకశాఖ మరియు దేవదాయశాఖ సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలి. గతంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజంపై ఇచ్చిన సూచనల ప్రకారం.. భక్తులు దైవదర్శనంతోపాటు సమీపంలోని ప్రకృతి ప్రాంతాలను కలిపి కాంబో టూరిజం ప్యాకేజీలు డిజైన్ చేయాలి' అని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ సమావేశంలో టూరిజం అధికారులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమానికి శ్రీకారం





(మొదటి పేజీ తరువాయి)

ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 అక్టోబర్ 2 న మచిలీపట్నంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రతి మూడో శనివారం ఒక జిల్లాను సందర్శిస్తూ ముఖ్యమంత్రి స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో వదిలేసిన సుమారు 153 లక్షల టన్నుల లెగసీ వ్యర్థాలలో, గ్రౌండ్ పైన ఉన్న 85 లక్షల టన్నుల చెత్తను అధికారులు రికార్డు స్థాయిలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2025 అక్టోబర్ 2 నాటికి ఏడాదిలోనే తొలగించారు. మిగిలిన భూగర్భ చెత్తను కూడా వచ్చే జూన్ చివరి నాటికి పూర్తిగా క్లియర్ చేసే దిశగా వేగంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో చెత్తను విద్యుత్‌గా మార్చే "వేస్ట్ టు ఎనర్జీ" ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రస్తుతం విశాఖపట్టణం, గుంటూరు ప్రాంతాల్లో ప్లాంట్లు పనిచేస్తుండగా, మరో ఆరు ప్లాంట్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇవి రాబోయే రెండేళ్లలో పూర్తై చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నాయన్నారు. అలాగే ప్లాంట్లు లేని మిగిలిన 123 మున్సిపాలిటీల్లో చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేసే విధంగా టెండర్లు పిలిచారన్నారు. వచ్చే నెల జూన్ చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారన్నారు. రాష్ట్రంలో భవిష్యత్తులో డంప్‌యార్డ్స్ లేకుండా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర ఉద్యమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విస్తృతంగా అమలు చేస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రతలో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు, 107 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు. డోర్ టు డోర్ చెత్త సేకరణను సమర్థవంతంగా అమలు చేస్తూ, 2000 ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచుతున్నామని పేర్కొన్నారు. గత సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో రాష్ట్రానికి ఐదు అవార్డులు లభించాయని, ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సూపర్ లీగ్‌లో స్థానం సంపాదించుకోవడం సంతోషకరమని పేర్కొంటూ, స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు అందరూ సమిష్టిగా పనిచేస్తున్నారని తెలిపారు. స్వర్ణాంధ్ర సాధనలో స్వచ్ఛాంధ్ర కీలక పాత్ర పోషిస్తుందని మున్సిపల్ వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ... విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నగర పరిశుభ్రత కేవలం పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విజయవాడలో 3600 మంది శానిటేషన్ సిబ్బంది ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్నారని, వారికి ప్రజలు సహకరించాలని కోరారు. చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా డస్ట్ బిన్లలో వేయాలని సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా రెడ్, ఎల్లో స్పాట్ల నిర్మూలన, డ్రైన్ల శుభ్రత, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. బహిరంగ మూత్ర విసర్జన నివారణకు వినూత్న చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలు, వ్యాపారులు, బల్క్ వేస్ట్ జనరేటర్లు అందరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే విజయవాడను మరింత పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దగలమని సురేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. వ్యాపారులు, విద్యా సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవోలు, యువతతో పాటు సమాజంలోని ప్రతి వర్గం పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. స్వచ్ఛాంధ్ర ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడి, వారి ఆదాయం పెరిగి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమర్థవంతంగా అమలు చేయాలంటే ముందుగా పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు టెర్రస్ గార్డెన్ గ్రూపులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నగర ప్రజలు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# గుంతకల్లు రోజ్ గార్ మేళాలో 120 మంది అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను అందచేసిన కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

- ఇచ్చిన మాటకు మించి ఉద్యోగ కల్పన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో వివిధ దఫాలుగా దాదాపు 12 లక్షల మందికి కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో నియామకాలు పూర్తి : కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్










**గుంతకల్లు (అనంతపురం),కలంకౌంటర్ :** - దేశ వ్యాప్తంగా 47 ప్రాంతాల్లో ఒకేసారి రోజ్ గార్ మేళా కార్యక్రమం నిర్వహణతో 51,000 మందికి పైగా యువతకు నియమక పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహణలో భాగంగా శుక్రవారం గుంతకల్లు రైల్వే ప్రభాత్ క్లబ్ నందు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామక పత్రాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన రోజ్ గార్ మేళా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గౌ. కేంద్ర సహాయ మంత్రి హోమ్ అఫైర్స్ బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఎడిఆర్ఎం బి.ఎస్.శివప్రసాద్, డివిజనల్ పర్సనల్ అధికారి హెచ్.ఎల్.ఎన్ ప్రసాద్, తదితర రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో ప్రార్థనతో ఈ కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో భాగంగా రోజ్ గార్ మేళాలో ఉద్యోగ నియామక పత్రాలు పొందుతున్న పలువురు అభ్యర్థులను ఉద్దేశించి గౌ.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి సందేశాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్, అధికారులు వర్చువల్ గా వీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కల్పన మరియు రోజ్‌గార్ మేళా భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తూ చేపట్టిన అతిపెద్ద కార్యక్రమం 'రోజ్‌గార్ మేళా' అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ గతంలో ప్రకటించిన విధంగా 10 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా వివిధ దఫాలుగా దాదాపు 12 లక్షల మందికి కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో నియామకాలు పూర్తి చేయడం విశేషం అని తెలిపారు. తాజాగా నేడు నిర్వహిస్తున్న కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించి, ఒకే రోజు 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను గొప్ప పండుగ వాతావరణంలో అందచేస్తున్నారని అన్నారు. నూతనంగా విధుల్లో చేరుతున్న ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తూ, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికతను వివరిస్తూ, దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి మరియు విధుల్లో ఉత్తమంగా రాణించడానికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం అధికారం కాదని, అది ప్రజలకు సేవ చేసే ఒక గొప్ప అవకాశమని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, అప్పుడే దేశం నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో చేరుకోగలమని వివరించారు. గత పాలనలో ఉన్న అవినీతి, పైరవీల సంస్కృతిని విడనాడి, మోదీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాల నుండి పాలన వరకు అంతా పారదర్శకంగా సాగుతోందని, దానిని ఉద్యోగులు కొనసాగించాలని కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలన్నారు. ఇందుకోసం ఐగాట్ (ఐ+గా) కర్మయోగి ప్లాట్‌ఫామ్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా, ఏ పని చేసినా 'దేశ ప్రయోజనాలే పరమావధి'గా ఉండాలని, తర్వాతే కుటుంబమని భావన ఉండాలని పేర్కొన్నారు. ఇరాన్ అమెరికా యుద్ధం నేపథ్యంలో మన దేశ ప్రధాని పిలుపు మేరకు సప్త సూత్రాలను మనం ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన ఆవశ్యకత ఉన్నదని దేశ ఉజ్వల భవిష్యత్తుకు మనం అందరం కలిసి కృషి చేయాలని పేర్కొన్నారు. సాధ్యమైన చోట్ల Work From Home (WFH) ను ప్రోత్సహించాలనీ, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలనీ ప్రజా రవాణా, మెట్రో, ఈవీ వాహనాలు ఉపయోగించాలనీ, ఒక సంవత్సరం పాటు అనవసర విదేశీ ప్రయాణాలను నివారించాలనీ, స్వదేశీ (Swadeshi) ఉత్పత్తులను ప్రోత్సహించాలనీ,వంటనూనె వినియోగాన్ని తగ్గించాలనీ, రసాయన ఎరువులపై ఆధారాన్ని తగ్గించి సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనీ, అనవసరంగా బంగారం కొనుగోళ్లు తగ్గించాలనీ దేశాన్ని సంక్షోభంలో వెళ్లకుండా సహకరించాలని కోరారు. ఇండియా - పాకిస్తాన్ యుద్ధ సమయంలో జై జవాన్... జై కిసాన్ నినాదంతో ప్రజలకు ఒక పూట ఉపవాసం ఉండాలని ఇచ్చిన పిలుపుమేరకు సత్సంకల్పానికి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేళ్ల కాలంలో కేంద్రం సుమారు 12లక్షల కోట్ల రూపాయల నిధులను వివిధ పథకాలు మరియు ప్రాజెక్టుల రూపంలో రాష్ట్రానికి కేటాయించిందనీ, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విషయానికి వస్తే, కేవలం గత రెండేళ్లలోనే రాష్ట్రంలో సుమారు 3 లక్షల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు కేంద్రం శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా నూతన రాజధాని నిర్మాణం మరియు ఇతర అభివృద్ధి అవసరాల కోసం ఏపీకి 58,000 కోట్ల రూపాయల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం సమకూరుస్తోందన్నారు. దక్షిణ భారత దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ అని డబుల్ ఇంజిన్ సర్కార్ కేంద్ర సహకారంతో పెద్ద ఎత్తున కేంద్ర నిధులు రాష్ట్రానికి తేవడంలో సఫలీకృతులై నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఉద్యోగ నియామకాల్లో ఎటువంటి అవినీతి, సిఫార్సులు లేదా పైరవీలకు తావులేదని, కేవలం ప్రతిభ ఆధారంగానే నియామకాలు జరుగుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. కొత్తగా విధుల్లో చేరే ఉద్యోగుల నైపుణ్యాన్ని పెంచడానికి ఐగాట్ (iGOT) కర్మయోగి అనే ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని, ఇందులో దాదాపు 3,600 రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి, వీటి ద్వారా ఉద్యోగులు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవచ్చన్నారు. చివరిగా, దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి మరియు భారత్‌ను ప్రపంచంలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడానికి 2047 నాటికి 'వికసిత భారత్' నిర్మాణంలో ప్రతి ఉద్యోగి యువత భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తాము ఉద్యోగంలో చేరాక సమాజాన్ని, తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవాలని కోరారు. నరేంద్ర మోదీ గారు దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని కృషి చేస్తున్నారు తద్వారా దేశం ముందుకు వెళ్తుందని నమ్మిన ప్రభుత్వమని అన్నారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి దార్శనిక నాయకత్వంలో జరిగిన ఈ గొప్ప ఉపాధి సృష్టి కార్యక్రమంలో భాగమవడం నిజంగా ఆనందంగా ఉందని, భారత యువత దేశ నిర్మాణంలో ఉన్న అపార సామర్థ్యాన్ని గుర్తించిన ప్రధానమంత్రి గారు 2022 అక్టోబర్ 22న రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారనీ, ఈ రోజు 19వ రోజ్‌గార్ మేళా నిర్వహించబడుతోందనీ, ఇందులో రైల్వే మంత్రిత్వ శాఖ, పోస్టల్ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫైనాన్షియల్ సర్వీసెస్ శాఖ సహా అనేక ప్రభుత్వ సంస్థల్లో నియామక పత్రాలు పొందనున్నారు అని తెలిపారు. ఈ వేడుకలో సుమారు 120 మంది ప్రతిభావంతులైన యువతకు నియామక పత్రాలను అందచేయడం జరుగుతుందని, ఇందులో 93 మంది అసిస్టెంట్ లోకో పైలట్లు, 13 మంది రైల్వేలో కాంపాషనేట్ గ్రౌండ్ అపాయింట్ మెంట్లు, 9 మంది డిపార్ట్మెంట్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్, 4 మంది బ్యాంక్ ఆఫ్ బరోడా, ఒకరు సివిల్ ఏవియేషన్ శాఖలో నియామక పత్రాలు పొందనున్నారన్నారు. నియామక పత్రాలు అందుకుంటున్న ప్రతి అభ్యర్థికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం 120 మందికి సంబంధించిన నియామక పత్రాలను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా అభ్యర్థులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు, సిబ్బంది, ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# బడి వైపు అడుగు.. ప్రగతి వైపు పరుగు..

- జిల్లాలో ఉత్సాహంగా బడి పిలుస్తోంది కార్యక్రమం
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విలువల విద్య
- సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,కలంకౌంటర్ :** జిల్లాలో బడి పిలుస్తోంది కార్యక్రమం ఉత్సాహవంతంగా కొనసాగుతోందని.. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేలా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషిచేస్తున్నారని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ.. డీఈవో ఎల్.చంద్రకళ, సమన్వయ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి వత్సవాయి మండలంలోని భీమవరం, మక్కపేట గ్రామాల్లో పర్యటించారు. విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జరుగుతున్న బడి పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. భీమవరంలో ఇంటింటి అవగాహన కార్యక్రమంలో పాల్గొని తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరిన 26 మంది చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మక్కపేటలోని




జెడ్పీ ఉన్నతపాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రవేశాల తీరుతెన్నులను పరిశీలించారు. బడి బయట ఉన్న పిల్లలను సైతం గుర్తించి పాఠశాలలో చేర్పించారు.

# ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ

(మొదటిపేజీ తరువాయి)

గ్రాంట్లు పొందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద రాష్ట్రంలో పేదా ధనికా తేడా లేకుండా ప్రతీ ఒకొక్కరికి రూ. 2.50 లక్షల విలువైన వైద్య సేవలు అందిస్తామన్నారు. రూ. 25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ద్వారా వైద్య ఖర్చులు భరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పేదలకు సైతం మెరుగైన వైద్యం అందించేందుకు... ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని ఖాళీలు భర్తీ చేస్తున్నామని వివరించారు. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. ఆహారమే ఔషధం - వంటశాలే ఔషధ శాల అని మరోమారు సీఎం స్పష్టం చేశారు. ప్రజారోగ్యంతో పాటు వారి భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి వివరించారు.

**శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వరకూ కృష్ణా నీరు..** సమాజంలో ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించటంతో పాటు ప్రతీ నీటి బొట్టునూ సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో సమర్ధ నీటి నిర్వహణ ద్వారా జలనవరుల్ని కాపాడుతున్నామని... భూగర్భ జలాలు కూడా పెంచగలిగామని తెలిపారు. సముద్రంలో వృధాగా పోయే జలాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు అన్నింటినీ నింపగలిగామని వివరించారు. హంద్రీ-నీవా కాలువతో రాయలసీమ జిల్లాల్లోని చివరి ప్రాంతాలకు నీరు తీసుకెళ్లామని అన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న చర్యలతో భూగర్భ జలాలు పెరిగాయని, ఈ కారణంగానే అక్కడ పచ్చదనం పెరిగి ఉష్ణోగ్రతలు తగ్గినట్టు నివేదికలు చెబుతున్నాయని సీఎం అన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో నమోదు అవుతున్నాయని పిడుగురాళ్లలో 49 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని అన్నారు. వర్షపాతం తక్కువ కురుస్తుందన్న అంచనాలు ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేసే సంకల్పంతో ఉన్నామని దీనిపై ఇప్పటికే క్యాలెండర్ విడుదల చేసినట్టు తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తీసుకు వస్తామన్నారు. శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వరకూ నీటిని తరలిస్తామని చెప్పారు. గాలేరు-నగరి కోడూరు వరకు, మల్లె మడుగు బాలాజీ రిజర్వాయర్- 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. సోమశిల, స్వర్ణముఖి లింక్ కెనాల్-జూన్ 2028 పూర్తి అవుతుందన్నారు.



**రాయలసీమ ఇక ఫైటర్ జెట్ల తయారీ కేంద్రం..** 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని... రాష్ట్రంలోని 23 లక్షల మందికి యువతకు ఉద్యోగాలు వస్తాయని సీఎం స్పష్టం చేశారు. రాయలసీమలోని పుట్టపర్తిలో 5 జనరేషన్ యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామని... యుద్ధాల్లో పాల్గొనే జెట్ ఫైటర్ యుద్ధ విమానాల తయారీ కేంద్రంగా పుట్టపర్తి మారబోతోందని సీఎం అన్నారు. రాయలసీమను డిఫెన్స్ హబ్ గా చేస్తామన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, కర్నూలులో డ్రోన్, అనంతపురంలో ఏరోస్పేస్, స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ లాంటివి ఏర్పాటు కానున్నాయని వివరించారు. తిరుపతిలోనే త్వరలోనే బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ పరిశ్రమ ఏర్పాటు కాబోతోందన్నారు. రాయలసీమలో ఉక్కు పరిశ్రమ, సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు వచ్చే నెల కర్నూలో బంగారం ఉత్పత్తి చేసే గనుల్ని కూడా ప్రారంభించబోతున్నట్టు సీఎం తెలిపారు. రూ. 1 లక్ష కోట్లతో రాయలసీమలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వం నుంచి రూ.40 వేల కోట్లు, రూ. 60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు కూడా వస్తాయన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా గ్యాస్ కొరత, పెట్రోలు డీజిల్ ధరలు పెరిగినా... సమస్య తాత్కాలికమేనని అన్నారు. మహిళల కోసం కూటమి సర్కారు తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం 2 లాంటి పథకాలు అమలు చేసిందన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ తో పాటు చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

**గొడ్డలి పార్టీ గంగవెర్రులెత్తుతోంది..** రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ కావటంతో పాటు కూటమి చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను చూసి గొడ్డలి పార్టీ గంగవెర్రులెత్తుతోందని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలు కాపాడే రాజకీయాలు ఒకవైపు ప్రజల్ని భయపెట్టే మోసం చేసే రాజకీయాలు ఇంకోవైపు ఉన్నాయని ప్రజలు జాగ్రత్తగా గమనించాలని అన్నారు. నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్న వ్యక్తులు మీడియా ముందుకొచ్చి మంచోడినంటూ మాటలు చెబుతున్నారని.. ఇది గొడ్డలి పార్టీ నైజమని అన్నారు. వైసీపీ చేసిన 11 నిర్వాకాలను, అరాచక ఘటనలను సీఎం ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీలకు చోటులేదని..సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని.. గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్ అంటూ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ అంశాలపై సీఎం మాట్లాడుతూ.. 1.వివేకా హత్యలో నాటకాలు ఆడారు, నంగనాచి కబుర్లు చెప్పారు - అంతిమ లబ్దిదారు ఎవరనేది...ప్రతి ఒక్కరికీ తెలుసు. 2.కోడికత్తి డ్రామా... గులకరాయి డ్రామా ప్రజలందరికీ జ్ఞాపకం ఉంది. ప్రజలను మోసం చేసే ఎత్తుగడ, దుర్మార్గానికి పరాకాష్ట. 3.దళిత డ్రైవర్ సుబ్రమణ్యం హత్య, డోర్ డెలివరీ చేసిన నిందితుడికి అండదండలు ఇచ్చారు. 4.మాస్క్ అడిగిన దళిత డాక్టర్ సుధాకర్ పై పై దాడి చేశారు, వేధించి ప్రాణాలు తీశారు. 5.కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు వేశారు. ఆస్తి ఇవ్వకుండా తల్లికి, చెల్లికి అన్యాయం చేశారు. ఇంట్లో న్యాయం చేయకుండా బయట ఎలా న్యాయం చేస్తాడు. 6. హిందూ దేవుళ్లపై దాడులు చేశారు. అపవిత్ర కార్యక్రమాలు, కుట్రలు. తప్పుడు ప్రచారాలు చేశారు. 7. పోలవరం, అమరావతి, పెట్టుబడులు, అభివృద్ధిపై గొడ్డలి పార్టీ వేటు వేసింది. 8.నందం సుబ్బయ్య, చంద్రయ్య, జల్లయ్యల పీకలు కోసి నడిరోడ్డుపై చంపేసి రక్తదాహం తీర్చుకున్నారు. 9.గంజాయి బ్యాచ్ లకు ప్రోత్సాహం ఇచ్చారు. వాళ్ల కార్యకర్తలు రప్పా రప్పా రంకెలు వేశారు. జంతు రక్తంతో కటౌట్ కు అభిషేకాలు చేశారు. 10. కారు కింద వారి పార్టీ కార్యకర్త సింగయ్యను తొక్కించారు... కడపలో పెద్ద దస్తగిరిని చంపేశారు. 11.కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుకు రోజుకో నాటకం. పాస్టర్లతో దాడి డ్రామాలు చేస్తూనే ఉన్నారు. “ అని సీఎం వ్యాఖ్యానించారు. 5 ఏళ్ల పాటు రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి నిద్ర లేకుండా చేశారు. ప్రజలకు నరకం చూపించారన్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తనను అరెస్టు చేసి జైల్లో పెట్టారని ఆరోపించారు. ప్రజలందరిలోనూ భయాందోళనలు కల్పించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే స్వేచ్ఛ కల్పించామని సీఎం స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజా వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళి ఇతర ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ, చిత్తూరు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో ప్రజలు భాగస్వాములు కావాలిః ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు






**తిరుపతి,కలంకౌంటర్ :** తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా నిలపడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. శనివారం ఉదయం నారాయణపురం వద్ద ఉన్న చేపల మార్కెట్ వద్ద ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తో పాటు డిప్యూటీ కమిషనర్ అమరయ్య, గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర తదితరులు పాల్గొని ప్రారంభించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి పరిసరాలను శుభ్రపరిచారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ జూన్ 22వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాల్టీలు, కార్పొరేషన్స్ లో జరుగుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నాలుగు వారాలు పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఒక్కో వారం ఒక్కో అంశంతో నగరాన్ని శుభ్రపరచడమే ఆపరేషన్ క్లీన్ స్వీప్ లక్ష్యమని ఆయన చెప్పారు. స్వచ్చంద సంస్థలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భాగస్వాములు కావాలని ఆయన కోరారు. స్వచ్ఛసర్వేక్షణ్ లో భాగంగా పరిసరాల పరిశుభ్రతకు ప్రధానమంత్రి నరేంద్ర మోది ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన చెప్పారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ప్రతి మూడవ శనివారం పరిశుభ్ర నగరాలు, పంచాయితీల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం లో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ దేవికుమారి, డి.ఈ. లు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అధికరేట్లు వసూలు చేస్తే చర్యలు తప్పవు--ఎమ్మెల్యే ఇంటూరి

- మాలకొండపై పాటదారులకు ఎమ్మెల్యే ఇంటూరి హెచ్చరిక
- మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు





**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గం లో ప్రముఖ పుణ్యక్షేత్రం, మాలకొండపై వెలసిన శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా భక్తుల క్యూలైన్లు, అన్నప్రసాదం తయారీ, వేసవిలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను నాగేశ్వరరావు పరిశీలించారు. అన్నప్రసాదం నాణ్యతపై భక్తులతో మాట్లాడారు. నగదు, వస్తు రూపంలో అందిస్తున్న విరాళాలను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తితో అందిస్తున్న కూరగాయలు, బియ్యం, ఇతర వస్తువులు వృధా కాకుండా వినియోగించాలని అధికారులకు సూచించారు. లగేజీ పాయింట్, చెప్పుల స్టాండ్ వద్ద డబుల్ రేట్లు వసూలు చేస్తున్నట్లు భక్తులు ఫిర్యాదు చేయగా, పాటదారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొండపై పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నాగేశ్వరరావు పరిశీలించారు. వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నేతలు కాకుమాని హర్ష, కామినేని అశోక్ తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## పరిశుభ్ర ఆరోగ్య ఉయ్యూరే లక్ష్యం





**ఉయ్యూరు,కలంకౌంటర్ :** పుర ప్రముఖుల సహకారంతో పరిశుభ్ర ఆరోగ్యకర ఉయ్యూరు స్థాపించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉయ్యూరు కమిషనర్ ఎం. సుభాష్ చంద్రబోస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న “ఆపరేషన్ క్లీన్ స్వీప్” ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని శనివారం మునిసిపాలిటి పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉయ్యూరు మునిసిపల్ కమీషనర్ ఎం . సుబాష్ చంద్రబోస్ స్థానిక విష్ణాలయం దగ్గర ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఆ వార్డు లోని మూడు ప్రదేశములను శుభ్రం చేయడం జరిగినదని,.పారిశుద్ధ్య సిబ్బంది చెత్త తొలగింపు పనులు నిర్వహించారని చెప్పారు.. ప్రజల ఆరోగ్య రక్షణ మరియు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఆయనతెలిపారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మునిసిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. తడి మరియు పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వడం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ మరింత సమర్ధవంతంగా జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు కూడా నిర్వహించారు. పట్టణాన్ని స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన మరియు అందమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది,పారిశుద్ధ్య సిబ్బంది, దుర్గా ఎస్టేట్ కు సంబందించిన వాకర్స్ అసోసియేషన్ సబ్యులు మరియు ఆ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలంతా సహకరిస్తేనే పరిశుభ్రత సాధ్యం--ఎమ్మెల్యే ఇంటూరి

**--ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టర్ హిమవంశీ**



**కందుకూరు,కలంకౌంటర్ :** స్వర్ణఆంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, కందుకూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో... ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని పట్టణంలోని మాచవరం రోడ్డులో శనివారం ఉదయం నిర్వహించారు.ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ కే. అనూష, అధికారులు కూటమి పార్టీల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ సహా అందరూ చీపుర్లు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ... కేవలం అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పనిచేయటం వల్ల స్వచ్ఛత - శుభ్రత సాధ్యం కాదన్నారు. పట్టణ ప్రజలు కూడా పూర్తిగా సహకరిస్తేనే, మున్సిపాలిటీని పరిశుభ్రంగా తీర్చిదిద్దగలమని అన్నారు. అప్పుడే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పథకం యొక్క ఆశయం నెరవేరుతుందన్నారు., ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, అన్ని వార్డుల అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**- సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి.బుల్లికృష్ణ**



**కందుకూరు,కలంకౌంటర్ :**కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణం నందు మండల న్యాయ సేవా అధికార సంఘం వారి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగినది. ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కే.కే.వి.బుల్లికృష్ణ మాట్లాడుతూ మండల లీగల్ సెల్ అథారిటీ తరఫున న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించి బాల బాలికలను చైతన్యవంతం చేస్తున్నామని దానిలో భాగంగా బాల్య వివాహముల నిషేధం చట్టం గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ చట్ట ప్రకారం బాలికలు కనీసం 18 సంవత్సరముల వయసు నిండిన తర్వాత మాత్రమే వివాహం తలపెట్టాలని కుటుంబములోని తల్లిదండ్రులు పెద్దలు అందరూ కూడా బాలికలను చదివించి ప్రోత్సహించవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. మైనర్ బాలికల వివాహం చట్టరీత్యా నేరమని అన్నారు . బాల బాలికలు మేజర్లు అయ్యేవరకు వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించి చదివించాలని ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం తల్లిదండ్రులతో పాటు సమాజానికి కూడా బాధ్యత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలేటి శ్రీధర్ నాయుడు,ఐ.సి.డి.ఎస్ ఆఫీసర్ సిడిపిఓ కె. ఉషారాణి, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బెజవాడ కృష్ణయ్య న్యాయవాదులు టి తిరుమలరావు, ఎస్. పవన్ కుమార్, షేక్ సంసుద్దీన్, ఏవి సుబ్బారావు, షేక్ జమీర్, పరిటాల బ్రహ్మయ్య, మహిళా న్యాయవాదులు పి.పణి కుమారి, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కోదండ రాముని పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు





**ముండ్లమూరివారిపాలెం, కలంకౌంటర్ :** పొన్నలూరు మండలం ముండ్లమూరి వారి పాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో శ్రీ కోదండ రాముని పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు, టీటీడీ వేద పండితులు పర్చూరి సీతారామాచార్యులు, టిటిడి వేద పండితులునారాయణం అవినాష్ స్వామి,ఈదూరి వెంకట ఫణీంద్ర, పవన్, సుబ్బయ్య ల ఆధ్వర్యంలో వేదమంత్రాలు శ్రీ కోదండరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని కన్నుల పండుగ అలంకరించారు. ముండ్లమూరి వారి మేటి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగింది. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు పానకం, వడపప్పు తో పాటు వాతావరణం వేడిగా ఉండటంతో భక్తులకు పుచ్చ దబ్బలు పంపిణీ చేశారు. సాయంత్రం గ్రామస్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాయలసీమలో రక్తం ఏరులై పారించిన చరిత్ర మీది

● జగన్ పై మంత్రి సవిత ఆగ్రహం ● రాయలసీమలో ఫ్యాక్షనిజం రాజారెడ్డితోనే మొదలు ● వివేకా హంతకులు వైసీపీలోనే ఉన్నారు ● జగన్ నోట శాంతి వచనాలు విని నవ్వుతున్న జనాలు
● రాయలసీమకు వైఎస్ ఫ్యామిలీ చేసిందేమీ లేదు ● చంద్రబాబుతోనే సీమ అభివృద్ధి ● లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదు : మంత్రి సవిత

**పెనుకొండ/శ్రీసత్యసాయి,కలంకౌంటర్ :** రాయలసీమలో రక్తం ఏరులై పారించిన చరిత్ర నీది, నీ తాతది, నీ తండ్రిది.. నీ బాబాయ్ హంతకులు, దళితులను పొట్టన బెట్టుకున్నవారు నీ పార్టీలోనే ఉన్నారు కదా.. మహాత్మా గాంధీ, గౌతమ బుద్ధుడిలా నువ్వు శాంతి వచనాలు పఠిస్తే రాష్ట్రంలో నమ్మేవాళ్లెవరూ లేరు అని జగన్ పై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ సైకో పాలనతో అయిదేళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ఇక్కడి బిడ్డలను ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారులుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. మంత్రి నారా లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదన్నారు. పెనుకొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్ లో శుక్రవారం నిర్వహించిన జగన్ ప్రెస్ మీట్ ను చూసి జనాలు నవ్వుకుంటున్నారన్నారు. మహాత్మా గాంధీ, గౌతమ బుద్ధుడిలా జగన్ రెడ్డి శాంతి వచనాలు పఠించడం చూసి, చిన్న పిల్లలతో పాటు రాజకీయ అవగాహన లేని వారు సైతం నవ్వుతున్నారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షన్ కు నాందిపలికింది రాజారెడ్డి అని ఆరోపించారు. జగన్, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, తాత రాజారెడ్డి చరిత్ర అందరికీ తెలిసిందేనన్నారు.. ఫ్యాక్షన్ నైజంతో రాయలసీమలో రక్తం ఏరులై పారించారని, వారి రక్త దాహానికి బడుగు, బలహీన వర్గాల వారు, రాజకీయ ప్రత్యర్థులు బలైపోయారని అన్నారు. శవ రాజకీయాలు చేయడంలో జగన్ తరవాతే ఎవరైనా అని వైసీపీ నేత బొత్స సత్యనారాయణ గతంలో అనలేదా..? అని ప్రశ్నించారు. తండ్రి శవాన్ని రాజకీయ ఉనికి కోసం ఉపయోగించుకోలేదా..? అని జగన్ ను మంత్రి సవిత నిలదీశారు. తల్లిని, చెల్లెళ్లను సైతం ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. బాబాయ్ హంతకులు, దళిత సామాజిక వర్గానికి చెందిన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని పొట్టన బెట్టుకున్న వ్యక్తి వైసీపీలోనే ఉన్నారని మండిపడ్డారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అయిదేళ్ల పాటు రాష్ట్ర ప్రజలను తీవ్ర ఇబ్బందులు పాల్జేశారన్నారు. జగన్ గాని, ఆయన తాత రాజారెడ్డిగాని, తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిగాని రాయలసీమకుగాని, పులివెందుల అభివృద్ధికి గాని ఏం చేశారు..? అని మంత్రి సవిత నిలదీశారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయిన ఘటనలో అధికారంలోకి ఉండి కూడా జగన్ ఏమీ పట్టించుకోలేదని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.






**చంద్రబాబుతోనే రాయలసీమ అభివృద్ధి..** రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలూ కృషి చేస్తున్నారని మంత్ర సవిత కొనియాడారు. కియాలాంటి అంతర్జాతీయ కార్ల పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. రాయల్ ఎన్ ఫీల్డ్ పరిశ్రమతో పాటు ఏరో స్పెస్ పరిశ్రమను నెలకొల్పుతున్నారన్నారు. హార్టీకల్చర్ హబ్ గా, సోలార్ హబ్ గా, పారిశ్రామిక హబ్ గా రాయలసీమను అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతమొందించి, ఇక్కడి బిడ్డలను ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, ఐటీ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత కూడా సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమ అభివృద్ధి ప్రదాత అయితే, జగన్ ద్రోహిగా నిలబడ్డారన్నారు.

**ఆ అర్హత జగన్ కు లేదు..** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడంలో మంత్రి నారా లోకేశ్ కీలకంగా వ్యవహరించారన్నారు. గాడితప్పన విద్య వ్యవస్థను ప్రక్షాళన చేసి, ఏపీ విద్యా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. దేశంలోనే ఏపీని అగ్ర పథాన నిలుపుతున్న మంత్రి నారా లోకేశ్ గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదని మంత్రి సవిత తేల్చి చెప్పారు. రాజకీయ ఉనికి కోసం జగన్ మరోసారి శవ రాజకీయాలకు తెరలేపారని, ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదని మంత్రి సవిత తెలిపారు.

**చెత్త ఊడ్చి... చేతులతో ఎత్తి...** అంతకుముందు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని చెత్త ఊడ్చారు. స్వయంగా మంత్రి తన చేతులతో చెత్త తీసి డస్ట్ బిన్ లో వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్లీన్ పెనుకొండ – గ్రీన్ పెనుకొండకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ పేరుతో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి నెలా మొదటి వారంలో రోడ్లు, పబ్లిక్ ప్రదేశాల పరిశుభ్రత, రెండో వారంలో కాల్వల శుభ్రత, మూడో వారంలో చెత్త వేరు చేయడంపై అవగాహన, నాలుగో వారంలో పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రభుత్వం ఒక్కటే కాదు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే బాధ్యత తీసుకోవాలి"అని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్త ఇంటి కూల్చివేతపై అధికారులను నిలదీసిన ఎంపీ




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మున్సిపల్ అధికారుల వ్యవహారంపై ఎంపీ బాలశౌరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో జరిగిన సమావేశంలో మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ బాపిరాజును నేరుగా ప్రశ్నించిన సంఘటన చర్చనీయాంశమైంది. ప్రైవేట్ వ్యక్తుల మధ్య ఉన్న ఆస్తి వివాదాల్లో అధికారులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని ఎంపీ బాలశౌరి ప్రశ్నించారు. కోర్టుల్లో పరిష్కారం కావాల్సిన అంశాల్లో మున్సిపల్ అధికారులు ఇళ్ల కూల్చివేతలకు దిగడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. లక్షల రూపాయల విలువైన ఆస్తులను కూల్చివేయడం నైతికంగా సరైన చర్య కాదని స్పష్టం చేశారు."ఒక్కో కోర్టు ఒక్కో దశలో వేర్వేరు తీర్పులు ఇస్తుంది. తర్వాత ప్రజలకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు?" అంటూ కమిషనర్‌ను నిలదీశారు. ప్రభుత్వ ఆస్తి కాని భూముల విషయంలో అధికారులు అనవసర జోక్యం చేసుకోవద్దని సూచించారు. ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన అధికారులు భయాందోళనలు కలిగించేలా వ్యవహరించరాదని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇళ్ల కూల్చివేతలు చివరి మార్గంగా కూడా ఉండకూడదని, చట్టపరమైన స్పష్టత వచ్చిన తర్వాతే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఘటన ప్రస్తుతం మచిలీపట్నం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు.. తెలంగాణ కేబినెట్ ఆమోదం

● కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు ● రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం భేటీ ● తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు కేబినెట్ పచ్చజెండా

**తెలంగాణ, కలంకౌంటర్ :** గోదావరి పుష్కరాల కోసం రూ.1,000 కోట్లు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సంబంధిత పనుల కోసం నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని కేబినెట్ నిర్ణయించింది. అసోం రైఫిల్స్, బీఎస్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్ స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది.



మంత్రి కొల్లు రవీంద్ర సూచనల మేరకు ఇండోర్ స్టేడియంలో శనివారం మున్సిపల్ జెసిబి తో పిచ్చి మొక్కలు తొలగించి చదును చేయించుతున్న బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్, జిల్లా స్పోర్ట్స్ అధారిటీ అధికారి, కె. ఝూన్సీ లక్ష్మి.....
–మచిలీపట్నం,కలంకౌంటర్ :

## 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలి - జిల్లా కలెక్టర్ డీకే బాలాజి





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** పరిశుభ్రత గురించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని మచిలీపట్నంలో పూర్తిస్థాయిలో అమలు చేసి నగరంలో స్పష్టమైన మార్పు కనిపించేలా చేయాలని మచిలీపట్నం నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణపై శనివారం సాయంత్రం నగరంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణ కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నగరంలోని తన క్యాంప్ కార్యాలయము నుంచి సైకిల్ పై వచ్చి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని కేవలం నిబంధనల పరంగా కాకుండా ఆత్మస్ఫూర్తితో అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఏడు ముఖ్య అంశాలపై దృష్టి సారించాలని చెప్పారు. రోడ్ స్వీపింగ్, ఎల్లో స్పాట్స్, రెడ్ స్పాట్స్ తొలగింపు, బ్లాక్ స్పాట్స్‌ను గ్రీన్ స్పాట్స్‌గా మార్చడం, విజిబుల్ క్లీన్‌లీనెస్, డ్రైన్ల డిసిల్టేషన్, బల్క్ వేస్ట్ జనరేటర్ల వద్ద వ్యర్థాల ప్రాసెసింగ్, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రత వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. మచిలీపట్నంలో ఎల్లో స్పాట్స్, రెడ్ స్పాట్స్ పెద్దగా లేవని భావిస్తున్నప్పటికీ ఎక్కడ ఉన్నా వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్స్‌ను వచ్చే వారం రోజుల్లో గ్రీన్ స్పాట్స్‌గా మార్చి నగరంలో స్పష్టమైన మార్పు తీసుకురావాలని చెప్పారు. ముందుగా చెత్త తొలగించి, అనంతరం ఆ ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దాలని చెప్పారు. పెయింటింగ్‌లు, రెడ్ గ్రావెల్, మొక్కలు, బెంచీలు ఏర్పాటు చేయడం, అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాలను శాశ్వతంగా పరిశుభ్రంగా ఉంచేలా



చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక వ్యాపారులు, సంస్థల ద్వారా స్పాన్సర్‌షిప్ తీసుకుని అభివృద్ధి పనులు చేపడితే ప్రజల్లో బాధ్యతాభావం పెరుగుతుందని పేర్కొన్నారు. ఒకసారి శుభ్రం చేయడం కంటే వాటిని నెలరోజుల పాటు క్రమంగా నిర్వహిస్తే జీవితాంతం పరిశుభ్రత కొనసాగుతుందని కలెక్టర్ అన్నారు. ఇందుకోసం ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం మున్సిపల్ సిబ్బందిపైనే ఆధారపడకుండా జిల్లా స్థాయి అధికారులను కూడా బాధ్యతల్లో భాగస్వామ్యం చేస్తున్నట్లు ప్రకటించారు. వారిని మున్సిపల్ కమిషనర్‌కు ప్రత్యేకంగా అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. వారు సమన్వయంతో పనులు పూర్తి చేస్తారని నమ్మకం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ అధికారులు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించిన కలెక్టర్, పెయింటింగ్, మొక్కలు, గ్రావెల్, బెంచీల ఏర్పాట్లలో వేగం పెంచాలని ఆదేశించారు. అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి కూడా పెయింటర్లను తీసుకువచ్చి పనులు వేగవంతం చేయాలని చెప్పారు. రోడ్ స్వీపింగ్, విజిబుల్ క్లీన్‌లీనెస్ కోసం స్వచ్ఛాహితులు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ప్రతి రోజు లిట్టర్ పికింగ్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో బాధ్యతాభావం పెరుగుతుందని పేర్కొన్నారు. డ్రైనేజీల డిసిల్టేషన్ పనులను రెండో వారంలో ప్రారంభించి, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రతపై మూడో లేదా నాలుగో వారంలో ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. బల్క్ వేస్ట్ జనరేటర్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు వంటి సంస్థలు తమ వద్దే వ్యర్థాలను ప్రాసెస్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం కలెక్టర్లకు విస్తృత అధికారాలు ఉన్నాయని, అవసరమైతే జరిమానాలు విధించడం, విద్యుత్ కనెక్షన్లు నిలిపివేయడం వంటి చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు. అయితే ముందుగా అవగాహన కల్పించి తగిన సమయం ఇస్తామని చెప్పారు. రాబోయే నెల రోజుల పాటు తాను కూడా ప్రత్యక్షంగా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొంటానని కలెక్టర్ వెల్లడించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి మచిలీపట్నంలో ఆదర్శవంతమైన మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రత్యేక అధికారులు మెప్మా పీడీ సాయిబాబు, డి టి డబ్ల్యు ఓ ఫణి ధూర్జటి, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, పారిశుద్ధ్య నిర్వహణ కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మే 25న తాలిం-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్ ఫలితాలు

● మంత్రి ఫరూక్ చేతుల మీదుగా ఫలితాల విడుదల.
● ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్.




**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన తాలిం-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్ మూల్యాంకన ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన ప్రాథమిక సమాధాన కీ (Answer Key) ఇప్పటికే విడుదల చేసినట్లు, విద్యార్థులు దానిని సంబంధిత వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని ఆయన తెలిపారు. పరీక్షను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, పూర్తి పారదర్శకతతో నిర్వహించామని, అలాగే మూల్యాంకన ప్రక్రియను కూడా అదే స్థాయి భద్రతా ప్రమాణాలు, నిష్పక్షపాత విధానం, పారదర్శకతతో పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్ష ఫలితాలను మే 25న మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ చేతుల మీదుగా అధికారికంగా విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థుల ఎంపిక పూర్తిగా మెరిట్ ఆధారంగానే జరుగుతుందని, ఫలితాల విడుదల అనంతరం ఎంపికైన విద్యార్థులకు తదుపరి ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేస్తామని అబ్దుల్ అజీజ్ తెలిపారు.

## జిల్లా పోలీసు శాఖకు డ్రోన్ వితరణ - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** జిల్లా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. "తిరుమల మెడికవర్ హాస్పిటల్" మేనేజింగ్ డైరెక్టర్ డా.తిరుమల ప్రసాద్ సామాజిక బాధ్యతలో భాగంగా ముందుకు వచ్చి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డ్రోన్ ను జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కి అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ "తిరుమల మెడికవర్ హాస్పిటల్" మేనేజింగ్ డైరెక్టర్ డా.తిరుమల ప్రసాద్ ని శాలువాతో సత్కరించి, పూల మొక్కను అందచేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, 1వ పట్టణ పోలీసు స్టేషన్ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు మరియు ఇతర పోలీసు అధికారులు, తిరుమల మెడికవర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.తిరుమల ప్రసాద్ పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com